www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 30 | నవంబర్ | 2025 పేజీలు : 8

## ముగిసిన తొలి విడత నామినేషన్ల ఘట్టం

**-చివరి రోజు భారీగా నామినేషన్ల దాఖలు**
**-నేటి నుంచి రెండవ విడత నామినేషన్ల స్వీకరణ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి విడత నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఖమ్మం జిల్లాలో తొలి విడతలో 192 సర్పంచ్ స్థానాలకు, 1740 వార్డు స్థానాలకు డిసెంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఈనెల 27 నుంచి శనివారం వరకు నామినేషన్లను స్వీకరించారు. చివరి రోజు

మిగతా 2లో..

## సమష్టి కృషితో సర్పంచ్ స్థానాలు
# కైవసం చేసుకుందాం



**- ప్రతీ స్థానం నుండి నామినేషన్లు దాఖలు చేయాలి**
**- సర్దుబాట్లు, పొత్తులపై చర్చలు సాగుతున్నాయి**
**- సమావేశంలో కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నియోజకవర్గంలో రెండో, మూడో దఫా జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో సమష్టి కృషితో సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవడానికి సిపిఐ శ్రేణులు సమాయత్తం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం ముఖ్యకార్యకర్తలతో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యాతిథిగా

మిగతా 2లో..

## 24 గంటలు తాగునీటి సరఫరా



**-రూ. 220 కోట్లతో అభివృద్ధి పనులు**
**-నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి**
**-అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలో 35వ డివిజన్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి రూ. 50.25 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో చేపట్టే అభివృద్ధి పనులు నాలుగు కాలాల పాటు స్థిరంగా ఉండేవిధంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా ప్రజలు, కార్పొరేటర్లు సహకరించాలని కోరారు. అమృత్ పథకం క్రింద ఖమ్మం కార్పోరేషన్‌కు రూ. 220 కోట్లు మంజూరు చేయడం జరిగిందని

మిగతా 2లో..

## దీక్షా దివస్‌తో
# తెలంగాణ సిద్ధించింది



**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**
**- ఖమ్మంలో ఘనంగా దీక్షా దివస్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేసిఆర్ చేపట్టిన దీక్షా దివస్‌తోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. 2009లో కేసిఆర్ నవంబర్ 29న చేపట్టిన దీక్షకు గుర్తుగా బిఆర్ఎస్ శ్రేణులు దీక్షా దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్సీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్,

మిగతా 2లో..

## భక్తరామదాసు కళాక్షేత్రాన్ని
# ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి



**-అవసరాలకు తగినట్లుగా ఆధునీకరించాలి**
**-ఆధునీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్త రామదాసు కళాక్షేత్రం ఆధునీకరణకు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం భక్తరామదాసు కళాక్షేత్రాన్ని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. కళా క్షేత్రం మొత్తం కలియ తిరుగుతూ చేయాల్సిన పనులను పరిశీలించారు. కళా క్షేత్రంలో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై టాప్ ప్రూప్ లీకేజీ, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్, పార్కింగ్, కలర్ వాష్, పరిసరాలలో పచ్చదనం కోసం మొక్కల పెంపు నిర్వహణ, మరమ్మతు పనులపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళలకు,

మిగతా 2లో..

# దీక్షా దివస్‌తో తెలంగాణ సిద్ధించింది



**(మొదటిపేజీ తరువాయి)**
మాజీ ఎంఎల్‌ఏలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ పాల్గొన్నారు. దీక్షా దివస్ సందర్భంగా తొలుత అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు, బిఆర్ ఎస్ నేతలు నివాళులర్పించారు. అనంతరం బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలాభిషేకం నిర్వహించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ కేసిఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అంటూ 2009 నవంబర్ 29న కేసిఆర్ దీక్షకు పూనుకున్నారన్నారు. అప్పటి ప్రభుత్వం దీక్ష జరగకుండా ఉండేందుకు కేసిఆర్‌ను అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారన్నారు. జైలుకు తరలించినా కేసిఆర్ జైలులో దీక్ష చేపట్టారన్నారు. దీక్షతో అనారోగ్యానికి గురైన కేసిఆర్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. చావు అంచుల వరకు వెళ్లిన కేసిఆర్ దీక్షతో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ తొమ్మిది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి ప్రకటన చేసిందన్నారు. కేసిఆర్ చేపట్టిన దీక్షకు గుర్తుగా దీక్షా దివస్‌ను జరుపుకుంటున్నామన్నారు. నవంబర్ 29న కేసిఆర్ చేపట్టిన దీక్ష తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఆర్‌జెసి కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఖమర్, ఉద్యమ కారులు ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, కార్పొరేటర్లు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకుందాం

**(మొదటిపేజీ తరువాయి)**
హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సిట్టింగ్ స్థానాలను పదిలం చేసుకోవడంతో పాటు మరిన్ని స్థానాలు గెలుపొందేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి, విజయానికి ప్రతీ కార్యకర్త ప్రజాక్షేత్రంలో పనిచేయాలన్నారు. ప్రతీ స్థానం నుండి పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సంక్షేమపథకాలపై వివరించి ఓట్లు అడగాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీలతో సర్దుబాటు, పొత్తులపై చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, బలమున్న ప్రతీ చోటా పోటీ చేసేందుకు సిద్ధం కావాలని కూనంనేని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, జి వీరస్వామి, భూక్యా ధస్రు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన తొలి విడత నామినేషన్ల ఘట్టం

**(మొదటిపేజీ తరువాయి)**
నామినేషన్ ప్రక్రియ అర్థరాత్రి వరకు కొనసాగింది. మొత్తం సర్పంచ్ స్థానాలకు 1,000కు పైగా, వార్డు స్థానాలకు 4,000 మందికి పైగా అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 30న నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ ఒకటిన అప్పీల్ స్వీకరణ, మూడున నామినేషన్ల ఉప సంహరణకు మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు విధించారు. అనంతరం పోటీలోఉండే అభ్యర్థుల వివరాలను ప్రకటించడంతో పాటు గుర్తులను కూడా కేటాయించనున్నారు. తొలి విడతకు సంబంధించి డిసెంబర్ 11న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. తొలి విడతలో కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో కోలాహలం నెలకొంది.

**నేటి నుంచి రెండవ విడత నామినేషన్‌లు :**

రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఆదివారం నుంచి డిసెంబర్ రెండు వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. రెండవ విడతలో కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల పరిధిలోని 183 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

# భక్తరామదాసు కళాక్షేత్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి



**(మొదటిపేజీ తరువాయి)**
కళాకారులకు పుట్టినిల్లయిన ఖమ్మం జిల్లాలో ఉన్న భక్తరామదాసు కళాక్షేత్రాన్ని ఆధునీకరించి మౌళిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. భక్త రామదాసు కళాక్షేత్రం ఆకర్షణీయంగా తయారు చేయడం, సౌండ్, ఆడియో వ్యవస్థను మెరుగుపర్చడం, పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటుకు చర్యలు, గోడలకు సాంప్రదాయక వాల్ పెయింటింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, టాప్ ప్రూఫ్ వాటర్ లీకేజీ, కళాక్షేత్రం బయట పరిసరాలలో గ్రీనరీకి తగు చర్యలు, పూర్తి స్థాయి మరమ్మతు పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంటీరియల్ మరింత ఆకర్షణీయంగా తయారు చేయడం కళాక్షేత్రంలో ఏసి ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలని వెనక ఉన్న ప్రేక్షకులకు డయాస్ స్పష్టంగా కనిపించేలా రూపొందించాలన్నారు. కళాక్షేత్రం సౌండ్ ప్రూఫ్, లోపల ఆడియో మైక్ వ్యవస్థ పక్కాగా ఉండేలా చూడాలని తెలిపారు ముందు సీట్లలో కూర్చునే ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా స్టేజీ ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు తయారు చేసిన మోడల్ డిజైన్ మ్యాప్‌లు, ఆర్కిటెక్చర్ రూపొందించి నమూనా వీడియోను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట జెడ్పి సిఈవో దీక్షారైనా, పంచాయతీరాజ్ ఇఇ మహేష్‌బాబు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, మున్సిపల్ డిఈ ధరణికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటలు తాగునీటి సరఫరా

**(మొదటిపేజీ తరువాయి)**
అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించుకుని చేపట్టాల్సిన పనుల యొక్క డిపిఆర్ తయారు చేయాలన్నారు. డిసెంబర్ నెలలో అమృత్ పనులకు టెండర్లు పిలిచి వేసవి కాలం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. నగర వ్యాప్తంగా 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 200 కోట్లతో ఖమ్మం నగరంలో డ్రైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఖమ్మం ఖిల్లాకు రోప్‌వే సౌకర్యం కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. లకారం పక్కన శిల్పారామం నిర్మిస్తున్నామని, వెలుగుమట్ల అర్బన్ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రబోయినపల్లిలో అధికారుల సోదాలు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో కేంద్ర ఇంటెలిజెన్స్ ,సైబర్ క్రైమ్, అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సానుభూతిపరుని గృహంలో శనివారం ఉదయం కేంద్ర ఇంటిలిజెన్సీ, సైబర్ క్రైమ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని జామీనుపై విడుదల చేసినట్లు సమాచారం. తల్లి మృతితో డిసెంబర్ 4వ తేదీన దశదిన కర్మ ఉన్నందున జామీనుపై విడుదల చేసినట్లు సమాచారం కార్యక్రమం అయిన వెంటనే లొంగిపోవాలని షరతు విధించినట్లు సమాచారం. అదేవిధంగా లింగాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలియ వచ్చింది. దీంతో మండల పరిధిలోని పలు గ్రామాలలో రాజకీయ పార్టీలలో చర్చలు పలు విధాలుగా కొనసాగుతున్నవి. మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలలో చర్చలు కొనసాగుతున్నవి.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఏకగ్రీవాలు




**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఏకగ్రీవాలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ జూలూరుపాడు లో శనివారం సిపిఎం పార్టీ మండల కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏకగ్రీవాలు జరుగుతున్న గ్రామపంచాయతీలలో ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏకగ్రీవ ఎన్నికల వల్ల కులం డబ్బు ప్రతిపాదన కేవలం పెత్తందారులకు ధనవంతులకు మాత్రమే రాజకీయ అవకాశం ఉంటుందని అన్నారు. ఏకగ్రీవ ఎన్నికల ద్వారా ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటు వేసి హక్కును ఎన్నికల్లో పోటీ చేసే ప్రజాప్రతినిధిని ఎన్నుకునే హక్కు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకగ్రీవాల పేరుతో ప్రజలకు ప్రజాస్వామ్యాన్ని దూరం చేసి ప్రజాస్వామ్య వ్యవస్థనే అపహాసం చేస్తున్నారని అన్నారు. లక్షలు కోట్లు ఖర్చుపెట్టి ఏకీగ్రవాలు చేసుకున్న అభ్యర్థులు గ్రామ అభివృద్ధికి ఏం కృషి చేస్తారని ప్రశ్నించారు. ఏకగ్రీవాలు జరుగుతున్న గ్రామాలలో ప్రజలందరూ పాల్గొనడం లేదని కేవలం కొంతమంది మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ఇలా ఏకగ్రీవాలు చేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి ఇబ్బంది కలిగేలా ఉందని ఆయన అన్నారు. ఇలాంటి ఏకగ్రీవాలు జరగకుండా ఎన్నికల సంఘం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అదే విధంగా జూలూరుపాడు మండలంలో అన్ని గ్రామపంచాయతీలలో పోటీ చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థుల్ని గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి యాస నరేష్, మండల కమిటీ సభ్యులు వి చందర్ రావు, గార్లపాటి వెంకటి, కనక రత్నం, జె రాధాకృష్ణ ,దారావత్ రమేష్, బోడ అబిమిత్ర, బొల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్సైకి సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం రూరల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై బి.దీప్లా ఉద్యోగ విరమణ పొందడంతో ఆయనకు శనివారం స్థానిక సిపి కార్యాలయంలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. జ్ఞప్తికను అందించి ఆయన పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. భావి జీవితం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యలతో ఆనందంగా గడపాలని ఆయన ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో ఏసిపి నర్సయ్య, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్ కామరాజు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు బకాయిలు విడుదలకు కృషి చేస్తా



**ప్రజాపక్షం/కల్లూరుః** ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు పెన్షనర్స్ బకాయిలు విడుదలకు కృషి చేస్తానని పిఆర్‌టియు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్ద కోరుకొండిలో నామ కృష్ణమూర్తి, పేరు వంచలోని జ్యోతి పదవి విరమణ సభకు ముఖ్య అతిథిగా శ్రీపాల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఉన్న పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని వారి బకాయిలు విడుదలకు ప్రభుత్వంతో మాట్లాడుతానని పేర్కొన్నారు. అనంతరం వారిని శాలువాలతో పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు యుటిఎఫ్ నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ఘనంగా సన్మానించారు.

# సిపిఐ అభ్యర్థులను గెలిపించండి : జమ్ముల

**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్దులను గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. శనివారం చింతకాని మండలంలో నామినేషన్ చివరి రోజు రాఘవాపురం, చిన్నమండవ గ్రామాల సర్పంచ్ అభ్యర్దుల నామినేషన్ కార్యక్రమాల్లో జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ కమ్యునిస్టులతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని, మౌలిక వసతుల కల్పన కేవలం కమ్యునిస్టుల హయాంలోనే జరిగాయన్నారు. చిన్నమండవ గ్రామ సర్పంచ్ అభ్యర్ధి పర్చా రామచంద్రరావు ను గెలిపించి గ్రామాభివృద్ధి లో పాలుపంచుకోవాలన్నారు. గతంలో జరిగిన అభివృద్ధి రామచంద్రరావు చేసినదేనని, తిరిగి రామచంద్రరరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాఘవాపురం సర్పంచ్ అభ్యర్ధి కాంపల్లి కోటమ్మ, నాయకులు కొల్లి గోవిందరావు, దొబ్బల



వెంగళరావు, సింగారపు సత్యనారాయణ, కొండపర్తి బాలాజీ, కొల్లి రవి, అబ్బూరి మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రాఘవాపురం సర్పంచ్‌గా కాంపల్లి కోటమ్మ

### రెండోసారి సిపిఐ ఏకగ్రీవం

**ప్రజాపక్షం/చింతకాని :** రాఘవాపురం గ్రామ సర్పంచ్‌గా సిపిఐ అభ్యర్ధి కాంపల్లి కోటమ్మ ఎన్నిక ఏకగ్రీవం అయింది. సర్పంచ్ ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో గ్రామంలో ఎస్సీ మహిళ కాంపల్లి కోటమ్మ ఒక్కరే ఉండటంతో సిపిఐ అభ్యర్ధిని కోటమ్మ ఎన్నిక లాంచనమైంది. శనివారం కోటమ్మ సర్పంచ్ అభ్యర్థిగా ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. గ్రామంలో ఎనిమిది వార్డులకు గాను సిపిఐ అభ్యర్దులు 1 వవార్డు సింగారపు నాగమ్మ, 3వ వార్డుకు మేడా రాజేశ్వరి, 4వ వార్డుకు కాంపల్లి రమేష్, 5వ వార్డుకు అబ్బూరి మహేష్, 6వ వార్డుకు వడ్లమాని రాంబాబు, 7 వవార్డుకు వడ్డె నిరోష ఒక్కొక్కరుగా నామినేషన్ దాఖలు చేయడంతో వీరి ఎన్నిక కూడా ఏకగ్రీవంగా మారనుంది. 2 వ వార్డుకు ఎస్సీ మహిళ రిజర్వు కావడంతో ఆ వార్డుకు ఎస్సీమహిళలు





లేక పోవడంతో నామినేషన్ దాఖలు కాలేదు. సర్పంచ్ అభ్యర్ధి కోటమ్మను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినంధించారు. రాఘవాపురం గత సర్పంచ్ ఎన్నికల్లో కూడా సిపిఐ అభ్యర్ధి కొండపర్తి గోవిందరావును ఏకగ్రీవంగా ఎన్నుకన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొల్లి గోవిందరావు, దొబ్బల వెంగళరావు, సింగారపు సత్యనారాయణ, అబ్బూరి మహేష్, కొల్లి రవి, కొండపర్తి బాలాజీ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంరూరల్‌లో నేడు నామినేషన్ల స్వీకరణ



- అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- రౌడిషీటర్లు, సస్పెక్టడ్లు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు బైండవర్
- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా సహకరించాలి : ఏసీపీ తిరుపతిరెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రెండవ విడత నామినేషన్లను నేడు(ఆదివారం) స్వీకరించనున్నారు. 21గ్రామాలు,202వార్డులకు పోటీ చేసే అభ్యర్థుల నుండి ఈనెల 30నుంచి డిసెంబర్ 02సాయత్రం 5గంటల వరకు దాఖలు చేయనున్నారు. ఇందుకు గాను ఎన్నికల అధికారులు నామినేషన్లను స్వీకరించేందుకు 8క్లస్టర్లను ఏర్పాటు చేశారు. క్లస్టర్ 1లోని కామంచికల్ పంచాయతీలో కామంచికల్, దారేడు, పడమటితండా, 2లో పోలేపల్లి, గోళ్లపాడు, పల్లెగూడెం, 3లో తీర్థాల, మంగళగూడెం, పోలిశెట్టిగూడెం,4లో గూడూరుపాడు,తనగంపాడు, కస్నాతండా, 5లో ఎంవీ,పాలెం, 6లో ఆరెంపుల, కొండాపురం, 7లో ఆరెకోడు, ఆరెకోడు తండా, చింతపల్లి, 8లో తల్లంపాడు, పొన్నెకల్లు గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, వార్డులరే పోటీ చేసే అభ్యర్థులు నామీనేషన్లు వేయనున్నారు. ఈ ఎన్నికలలో పురుషులు 21771, మహిళ 21488,కలిపి మొత్తం 35797 మంది తమ ఓటు హక్కు వినియోగంచుకోనున్నారు. అలాగే ఎన్నికల సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే తహశీల్దార్ ఎదుట రౌడిషీటర్లు, సస్పెక్టెడ్, బెల్ట్ షాపుల నిర్వాహకులు బైండవర్ అయ్యారు. శనివారం వరంగల్‌క్రాస్‌రోడ్డులోని పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రాజకీయనాయకులతో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచలను అందించారు. పోలీంగ్ స్టేషన్ పరిధిలోని 100మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమల్లో ఉండనుందన్నారు. 8సెక్టర్లుగా విభజించి, ప్రతి సెక్టర్‌కు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను బందోబస్తుగా ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎంపిడీఓ రవికుమార్ ఆధ్వర్యంలో 418మంది పీఓలు, ఓపీఒలకు ఎన్నికల నియమావళిపై అవగాహణ కల్పించి, ట్రైనింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేయాలి



### అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధం

**ప్రజాపక్షం/ తల్లాడ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉన్నామని బిజెపి తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులు తెలిపారు. శనివారం అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు హాజరై నాయకులకు దిశానిర్ధేశం చేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పంచాయతీ నుంచి బిజెపి పార్టీ గెలుపుకు తీసుకోవాల్సిన కార్యచరణపై చర్చించారు. అధ్యక్షులు చల్లా నాగులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో బిజెపి పార్టీ ఎమ్మెల్యే స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉందని, మండల ప్రజలు బిజెపి పార్టీ పట్ల సానుకూలంగా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతిఒక్క నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మండలంలో కాషాయ జెండా ఎగురవేయాలని అన్నారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులు వస్తాయని, పంచాయతీల్లో బిజెపి పార్టీని గెలిపిస్తే మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గన్న మిశ్రా, జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ నెంబర్ గాదె కృష్ణారావు పెరికి కిరణ్, ఉపాధ్యక్షులు వేము రజిత, మండల కార్యదర్శి చల్ల నరేష్, తమ్మిశెట్టి కృష్ణ, మండల నాయకులు చౌడ నాగేశ్వరరావు, కటికి నర్సింహారావు, మర్సకట్ల బాబురావు, సాయి కృష్ణ, సంగీతం సాయి చందు, గుండెల గురునాథ, మండల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. శనివారం ఖమ్మం నగరంలో ఇల్లందు క్రాస్ రోడ్డు నుంచి ఎన్‌టిఆర్ సర్కిల్ వరకు చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేలా ఫుట్‌పాత్‌లను రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫుట్‌పాత్‌ల వెంట గ్రీనరీ, డ్రైనేజీ సదుపాయాలు, పాదాచారులకు అడ్డంకులు లేకుండా మార్గం ఉండేలా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణ చేపడతామన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

# సర్వజ్ఞలో వక్తృత్వ పోటీలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. శనివారం అక్షరాల తోవ సాహితి సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనార్థాలు నివారణ చర్యలు అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి ప్రసంగించారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ పోటీల్లో ఎనిమిదవ తరగతి విద్యార్థులు శ్రీనాథ్, భగవత్, జాస్మిత, తొమ్మిదవ తరగతి విద్యార్థులు ధన్యశ్రేణిత, ఆదిత్య లు విజేతలుగా నిలిచారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ అభినందించారు. విజేతలకు జనవరిలో జరిగే వార్షికోత్సవ సభలో సన్మానించనున్నట్లు అక్షరాల తోవ నిర్వాహకులు నామ పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమల్ల ఉపేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్ధన్, పవిత్ర, తెలుగు ఉపాధ్యాయులు ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్‌లో ఫుడ్‌ఫెస్ట్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించారు. శనివారం పాఠశాలలో మంచి ఆరో గ్యం కోసం మంచి ఆహారం అంటూ విద్యార్థులచే ఫుడ్ ఫెస్ట్‌లో భాగంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా॥ కొండా అనిత పాల్గొని ఫెస్ట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలన్నారు.మంచి ఆహారం తీసుకుని శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని తెలిపారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, పౌష్టికాహారాన్ని స్వీకరించాలని, పండ్లు, కూరగాయలు, నట్స్, చిరుధాన్యాలు, డ్రై ఫ్రూట్స్, గుడ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఫుడ్ ఫెస్ట్‌లో వివిధ ప్రాంతాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఫుడ్ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథి కొండా అనిత మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని అధిక పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురలీమోహన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మైనర్ బాలికను వేదిస్తూ, అకారణంగా దాడి చేసిన ఇద్దరు యువకులను పట్టుకుని వారిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు సత్తుపల్లి పోలీసులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పఠాన్ షకీర్, షేక్ లాల్ మౌలా అలియాస్ షరీఫ్ అనే ఇద్దరు వ్యక్తులు మైనర్ బాలికను ప్రేమించమని వెంటాడుతూ, వేధిస్తూ బెదిరించడమే కాకుండా అకారణంగా దాడి చేయడంతో మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రదీప్ బాలిక ఫిర్యాదుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులైన చెందిన పఠాన్ షకీర్, షేక్ లాల్ మౌల అలియాస్ షరీఫ్ లను శనివారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం సత్తుపల్లి కోర్టులో హాజరుపరచినట్లు సిఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు.

# గుండెపోటుతో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి

### భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారంలో గల 15 బెటాలియన్ లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లబొయిన హన్మంతరావు, (40), పిసి నంబర్ 1176 శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో తన ఇంటి ప్రక్కన ఖాళీ స్థలంలో నడుస్తూ గుండెపోటుతో అక్కడే కుప్పకూలి పడిపోగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి హాస్పటల్ కు తీసుకురాగా పరీక్షించిన డాక్టర్ అప్పటికే చనిపోయినట్లు తెలిపారని, మరణానికి సంబంధించిన సరైన కారణం తెలుసుకొనుటకు భార్య నల్లబోయిన విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తుమ్మలపల్లి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు.

## వెంకటాపురం కాంగ్రెస్ అభ్యర్థిగా బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి నామినేషన్



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామపంచాయతీ కార్యాలయం నందు వెంకటాపురం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి శనివారం నామిషేన్ దాఖలు చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా టిడిపి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొగ్గుల లక్ష్మీ నామినేషన్ వేశారు. ఈ క్యాక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా రామకృష్ణ, పంబి సాంబశివరావు, గ్రామశాఖ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, రాజుపాలెం సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి, బొగ్గుల లక్ష్మీ, బూసుపల్లి వెంకటరెడ్డి, ఎర్రమల శ్రీనివాస్‌రెడ్డి కర్నాటి సుధాకర్‌రెడ్డి, వేముల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## షాహిద్‌కు మెడల్, సర్టిఫికెట్ అందజేత



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణంలోని తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాల నందు ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్‌కె షాహిద్ నవంబర్ 18న ఖమ్మం జిల్లా తరపున అండర్ 19 క్రికెట్ ఖమ్మం జిల్లా తరపున టోర్నమెంట్‌కు ఎంపికై ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నందు అత్యధిక ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లా జట్టు రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలుచుటకు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. అతడు సాధించిన సర్టిఫికెట్, మెడల్‌ను ఉమ్మడి జిల్లాల ఆర్ఎల్‌సి అరుణ కుమారి, సీతారాములు, ఇల్లందు మైనార్టీ జూనియర కళాశాల నందు అందజేశారు. జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రిన్సిపల్ ముధస్సార్ హుస్సేన్, పిడి నజీముద్దీన్, సైదులు, అశోక్, సాధిక్, ప్రసాద్, ఉషారాణి, రజిని, శిరీష, నర్మద, గౌస్, మహేశ్వరి, రేష్మ, చిరంజీవి, తదితరులు అభినందనలు తెలిపారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ప్రశాంత వాతావరణంలో పంచాయితీ ఎన్నికల ప్రక్రియ జరగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి అబ్దుల్ రహెమాన్ హెచ్చరించారు. మండలంలోని చంద్రుగొండ, దామరచర్ల, రావికంపాడు, గానుగపాడులో నామినేషన్ల కేంద్రాలైన పంచాయితీ కార్యాలయాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల నిర్వహణ జరగాలన్నారు. ఈ దిశగా అన్ని వర్గాలు సంయమనం పాటిస్తూ ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మీ, ఎస్ఐ శివరామకృష్ణ, ఎంపీడీవో బయ్యారపు అశోక్, సెక్రటరీ రాజేందర్ పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని రుద్రాక్షపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలోని పలు కుటుంబాలను సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ శనివారం పరామర్శించారు. రుద్రాక్షపల్లి గ్రామానికి చెందిన గాదె సత్యనారాయణ రెడ్డి ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన అదేవిదంగా దమ్మపేట మండలం, నాగుపల్లి గ్రామం లో ఫారెస్ట్ ప్లాంటేషన్ వాచర్ పెంకే ఆరోగ్యం ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట రుద్రాక్షపల్లి, నాగుపల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల శిక్షణా తరగతులో భాగంగా శనివారం పిఓ,ఓపిఓ ఎస్ లకు శనివారం ట్రైనింగ్ క్లాస్ లను శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపిడిఓ నాగేశ్వరరావు ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో సుమారు 390మంది పాల్గొన్నట్లు శిక్షణా అధికారి టిఓటి మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పున్నం సత్యనారాయణ, ఎంఈఓ నక్కా రాజేశ్వర రావు, పంచాయతీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## జూలూరుపాడు పంచాయతీ ఎన్నికలు నిలిపివేత..!



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయతీల కుగాను జూలూరుపాడు పంచాయతీ మినహాయించి, మిగిలిన 23 పంచాయతీల్లోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. గత 70 సంవత్సరాల క్రితం జూలూరుపాడు రెవిన్యూ, గుండెపుడి రెవి న్యూ, కాకర్ల రెవిన్యూ గ్రామాలు మధిర తాలూకాలో మైదాన ప్రాం తంగా కొనసాగాయి. 1953లో ఖమ్మం జిల్లా ఏర్పాటు సమయంలో బై ఫర్కేషన్లో భాగంగా, పరిపాలనా సౌలభ్యం కోసం జూలూరుపాడు, కాకర్ల, గుండెపుడి రెవిన్యూ గ్రామాలు పాల్వంచ తాలూకాలో కలపడం జరిగినది. అనంతరం 1960 తర్వాత కొత్తగూడెం తాలూకా నందు షెడ్యూల్ ఏరియాగా కొనసాగుతోంది. దీంతో జూలూరుపాడు గ్రామపంచాయతీ ఏజెన్సీ ప్రాంతం కాదని (రాష్ట్రపతి గెజిట్ నందు షెడ్యూల్ నోట్ పై లేనందున జూలూరుపాడు పంచాయితీ మైదాన ప్రాంతం అంటూ, జూలూరుపాడు పంచాయతీ నివాసి రామారావు అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2012లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జూలూరుపాడు పంచాయితీని మైదాన ప్రాంతంగా పరిగణించి, జనరల్ కేటగిరీలో రిజర్వేషన్ కేటాయించాలని కోర్టును ఆశ్రయించాడు. రామారావు అభ్యర్థనలు పరిశీలించిన న్యాయస్థానం, జూలూరుపాడు గ్రామ పంచాయతీ రిజర్వేషన్ ప్రక్రియపై తాత్కాలికంగా స్టే విధించింది. దీంతో జూలూరుపాడు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ నిలిచిపోయింది. న్యాయస్థానం తుది తీర్పు తర్వాతే జూలూరుపాడు గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

**తాత్కాలికంగా స్టే విధించిన హైకోర్టు**



**- ఎంపీడీఓ వివరణ...**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు 2025 నేపథ్యంలో, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా జూలూరుపాడు గ్రామపంచాయతీ సంబంధించిన ఎన్నికల ప్రక్రియపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, భద్రాద్రి కొత్తగూడెం వారు ఇచ్చిన తాజా ఆదేశాలమేరకు తెలియజేయడమైనది. డబ్ల్యూపి. నెం. 29921/2025 పిటిషనర్ టి. రామారావు, జూలూరుపాడు గ్రామ పంచాయితీ నివాసి కోర్టును ఆశ్రయించడంతో ప్రస్తుతం గౌరవ హైకోర్టు, తెలంగాణలో పెండింగ్ కేసులో ఉన్నాయి. 15.10.2025 మరియు 28.11.2025 తేదీలలో గౌరవ హైకోర్టు ఇచ్చిన ఇంటీరియం ఆదేశాల మేరకు జూలూరుపాడు గ్రామ పంచాయతీ సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయరాదని మరియు ఎన్నికల ప్రక్రియను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని.జూలూరుపాడు గ్రామ పంచాయతీకి సంబంధించి ఎటువంటి ఎన్నికల నోటీసులు, చర్యలు చేపట్టకూడదని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. హైకోర్టు తుది తీర్పు వచ్చిన వెంటనే తదుపరి ఎన్నికల చర్యలపై ప్రజలకు తెలియజేయబడుతుందని మండలపరిషత్ అభివృద్ధిఅధికారి తెలిపారు.

## జవ్వాజి అశ్విని నామినేషన్‌కు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా : జవ్వాజి అశ్విని**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా జవ్వాజి అశ్విని శనివారం నామినేషన్ కార్యక్రమానికి గ్రామంలో పెద్ద ఎత్తున కాంగ్రేస్ శ్రేణులు భారీ ర్యాలీతో తరలివెళ్లారు. నామినేషన్ కార్యక్రమానికి బయల్దేరిన అశ్విని నగరాఉ దంపతులు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకొని అనంతరం గ్రామంలోని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అశ్విని నాగరాజు దంపతులను భారీ పూలమాలతో సన్మానించారు. అనంతరం జవ్వాజి అశ్విని నాగరాజు మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామ పంచాయతీ అభివృద్ధికి చేయూతను అందించే విధంగా పరిపాలన



అఃదిస్తానని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో పంచాయతీకి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ప్రతిఒక్కరూ మీ ఇంటి బిడ్డల మీ కూతుర్ల ఆశీర్వదించి ఈ నెల11న జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రేస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిశువు మృతికి కారకులెవరు..?

**- పసిపాప మరణానికి రూ. 50 వేయిల ఖరీదు..!**
**- దారి తప్పుతోన్న వివాదం**




**ప్రజాపక్షం/పాల్వంచ :** పొత్తిళ్ళలో మృతి చెందిన పసిపాప మరణానికి రూ. 50 వేయిల ఖరీదు కట్టిన సంఘటన పాల్వంచలో కలకలం రేపుతోంది. ఇరువురి మద్యన జరిగిన వివాదం దారి తప్పుతోంది. ఆసుపత్రి యాజమాన్యం, బాదిత కుటుంబాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవటానికి సిద్దమవుతున్నారని సమాచారం. బడాబాబులు తాము చేసిన తప్పొప్పులను తమ ఆర్థిక పలుకుబడితో కేసులతో దారికి తెచ్చుకొంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. పాల్వంచ పట్టణం నెహ్రూనగర్ నిరుపేద ఆదివాసీ కుటుంబానికి చెందిన కుంజా భవాని మూడవ కాన్పు పురిటి నొప్పులతో ఈ నెల 26వ, తేదీ బుధవారం దమ్మపేట సెంటర్ లోని శ్రీ విజయా నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ అయింది. గురువారం ఉదయం వైద్యులు ఆపరేషన్ చేసి కాన్పు చేశారు. మగ బిడ్డికు జన్మనిచ్చింది. మూడవ సంతానం మగపిల్లవాడు కావటంతో ఆదంపతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఆకుటుంబం సంతోషంతో మునిగిపోయింది. మాకు తమ్ముడు వచ్చాడంటూ వాడితో ఆటలాడుకొంటామని అమ్మాయిలు ఆనందంతో గంతేశారు. ఇంతలోనే వైద్యులచే శిశువు మృతి చెందాడనే వార్త వినటంతో వారి గుండెల్లో పిడుగు పడ్డట్టయింది. ఆ తల్లి దండ్రుల రోదనలు మిన్నంటాయి. పుండుపై కారం చల్లినట్లుగా మానవత్వం మరిచిపోయిన ఆసుపత్రి యాజమాన్యం పూర్తి బిల్లు కడితేనే డిశ్చార్జి చేస్తామన్నారు. దీనితో చేసేదేమి లేక బాధితులు తమ బంధువులకు సమాచారం అందించారు. చికిత్స ఆలస్యం కావటంతోనే నవజాత శిశువు మరణించాడని ఆరోపించారు. వైద్యులతో వాగ్వాదానికి దిగారు. ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందాడని నినాదాలు చేశారు. సమాచారాన్ని తెలుసుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. పరిస్థితి అదుపులోకి తెచ్చారు. బాదిత బంధువులకు, ఆసుపత్రి యాజమాన్యానికి వారికి మధ్యవర్తులచే రాజీ చర్చలు జరిగాయి. చర్చలు ఫలించాయి. శిశువు మరణానికి రూ. 50 వేయిలు ఖరీదు కట్టారు. ఎంతో కొంత ఆసరా అవుతుందని భావించిన బాదిత నిరుపేద కుటుంబానికి చేదు వార్త మిగిలింది. బాధిత కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తమపై దురుసుగా ప్రవర్తించారని వారిపై కేసు నమోదు చేస్తేనే 50 వేయిలు చెల్లిస్తామంటూ అంటున్నారని మధ్యవర్తులు తెలిపారు. దీనితో భవాని కుటుంబ సబ్యులు ఆసుపత్రి యాజమాన్యం పై ఎస్‌సి,ఎస్‌టి చట్టం ప్రకారం కేసు పెట్టడానికి సిద్ధం అవుతున్నారని, మానవ హక్కుల సంఘానికి సైతం ఫిర్యాదు చేయటానికి తగిన సమాచారంతో ముందుకు సాగుతున్నారని సమాచారం. వివాదాన్ని సద్దుమణిగేలా చేసిన మద్యవర్తులను కాదని ఇలా వివాదానికి దిగడం కరెక్టు కాదని పలువురు అంటున్నారు. ఓ నిరుపేద కుటుంబానికి, సంఘంలో మంచి పేరు ప్రతిష్టలు కలిగిన విద్యావేత్తలకు జరుగుతున్న పంచాయితీ దారితప్పుతోందని అంటున్నారు. ఇదీకాక పురిట్లోనే మృతి చెందిన నవజాత శిశువు మరణానికి కారకులెవరనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా ఇంతవరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

## స్థానిక సంస్థల్లో కలగా మిగిలిన బీసీ రిజర్వేషన్లు..!

**-కోర్టుల తీర్పుతో చెదిరిన వెనుకబడిన వర్గాల స్వప్నం**
**-పార్టీ పరంగా అవకాశం కోసం ఎదురుచూపులు**

**ప్రజాపక్షం/పెనుబల్లి:** స్థానిక సంస్థల్లో వెనుకబడిన కులాలకు ( బీసీ) రిజర్వేషన్ల రూపంలో సముచితస్థానం దక్కుతుందనే ఆశలు కలగానే మిగిలాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటినుంచో పాగా వేసిన ఆధిపత్య వర్గాలకు రిజర్వేషన్ల ద్వారా చెక్ పెట్టొచ్చనుకున్న వెనుకబడిన వర్గాల నేతల స్వప్నం చెదిరింది. అన్ని పాలక పార్టీలు అరచేతిలో స్వర్గాన్ని చూపాయి. రాజ్యాంగ సవరణ జరగకుండా స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని కోర్టులు స్పష్టం చేశాక అటు హామీ ఇచ్చిన పార్టీగానీ,ఇటు రిజర్వేషన్లు కల్పించే అధికారం ఉన్న పార్టీ గానీ, పోరాడాల్సిన ప్రతిపక్ష పార్టీ గానీ కిమ్మనకుండా ఉన్నాయి. ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం తప్ప వెనుకబడిన వర్గాలకు ఒరిగిందేమీ లేదు. పెనుబల్లి మండలంలో ఉన్న 33 గ్రామపంచాయతీల్లో 8 గ్రామపంచాయతీలు ఏజెన్సీ ఏరియా పరిధిలో ఉన్నాయి. షెడ్యూల్ ఏరియాలో సర్పంచ్ అభ్యర్థులుగా మొత్తం ఎస్టీ అభ్యర్థులే పోటీ చేయాల్సి ఉంటుంది. వార్డుల్లో సగం స్థానాలు ఎస్టీలకు కేటాయించగా మిగిలిన స్థానాలు జనరల్ కేటగిరీలో ఉంటాయి. మొత్తంగా ఏజెన్సీ ఏరియాలో బీసీ రిజర్వేషన్లు అనేవి అమలు కావు. ఏజెన్సీ స్థానాలు పోను మండలంలో మిగిలిన 25 గ్రామపంచాయతీల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలులైతే 11 మంది బీసీ అభ్యర్థులకు అవకాశం లభించేది. ప్రస్తుతం ఉన్న 21 శాతం మూలంగా కేవలం 6 గురికి మాత్రమే పోటీ చేసేందుకు వీలు పడుతుంది. వార్డుల్లో కూడా ఇదే దామాషాలో నష్టపోవాల్సి వస్తుంది. సుప్రీం కోర్టులో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చుక్కెదురైన తర్వాత పార్టీ పరంగా 42 శాతాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షులు, ఇతర మంత్రులు ఎన్నోసార్లు బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడు ఆ పార్టీ తన వాగ్దానాన్ని అమలు చేసి ఇతర పార్టీలకు సవాలుగా నిలుస్తుందా లేదా అనేది చర్చనీయాంశమవుతుంది. కాంగ్రెస్




పార్టీ మాట మీద ఉంటుందా లేదా అనేది కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఎదురు చూస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక పూర్తిగా స్థానిక ఎమ్మెల్యే చేతుల్లో పెట్టినట్టుగా తెలుస్తోంది. పెనుబల్లి మండలంలో రామచంద్రాపురం పంచాయతీకి కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థిని గ్రామ ప్రజల సమక్షంలోనే ఎమ్మెల్యే మట్టా దయానంద్ రాగమయి ప్రకటించారు. ఇప్పటివరకు అమలైన కొద్దిపాటి రిజర్వేషన్ల ద్వారా గ్రామ, మండల స్థాయిలో ఎంతోమంది వెనుకబడిన వర్గాలకు చెందిన కార్యకర్తలు రాజకీయంగా ఎదగ గలిగారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు అయితే ఇంకా ఎక్కువ స్థాయిలో రాజకీయంగా అభివృద్ధి చెందగలమని ఆ వర్గాల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో నియోజకవర్గ స్థాయి నాయకులుగా ఎదిగి చట్ట సభల్లో పోటీకి ఎదురవుతామేమోనని రాజకీయ పార్టీలు రిజర్వేషన్లకు మోకాలడ్డుతున్నాయని బీసీ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికీ స్థానిక సంస్థల్లో,చట్టసభల్లో ఉన్నత కులాలే ఆధిపత్యం చలా ఇస్తున్నాయని పెనుబల్లి మండల బీసీ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కాటినేని శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. చట్టపరంగా రిజర్వేషన్లు అమలు కాకపోతే ఈ ఆధిపత్య సమాజంలో వెనుకబడిన వర్గాలు రాజకీయంగా ఎదగడం సాధ్యపడదన్నారు. ప్రజాస్వామ్యస్థానంలో ధనస్వామ్యం రాజ్యమేలుతోందని విమర్శించారు.

## అక్షరమే ఆయుధం.. జ్ఞానమే అసలైన శక్తి..!



**డాక్టర్ షేక్ మస్తాన్ హుస్సేన్**
**ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం**
**విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీ అందజేత**

**ప్రజాపక్షం/కరకగూడెం:** విద్య అనేది కేవలం అక్షరజ్ఞానాన్ని అందించే సాధనం మాత్రమే కాదని సమాజంలో నెలకొన్న చీకటిని తొలగించి, వెలుగులు నింపే శక్తిమంతమైన ఆయుధమని ఎంబీబీఎస్ డాక్టర్ షేక్ మస్తాన్ హుస్సేన్ పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన శనివారం ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ సభ్యులు, కరకగూడెం గ్రామీణ వైద్యులు షేక్ సోందుపాషా ఆధ్వర్యంలో కరకగూడెం మండలంలోని పడిగాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 50 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీని అందజేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులు అని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమైనదని ఉద్ఘాటించారు. కేవలం అక్షరాలు నేర్చుకోవడమే కాకుండా, విద్యార్థులు నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యకరమైన సమాజ నిర్మా



ణానికి,మానసిక శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు కూడా అంతే విలువైనవని కొనియాడారు. ఈ ఫౌండేషన్ చేపట్టిన ఈ విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం, విద్యార్థులు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పాఠశాలకు వెళ్లడానికి తోడ్పడుతుందని, ఇది నిజమైన సామాజిక సేవకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు సోందుపాషా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తమ ఫౌండేషన్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు షేక్ వసీం అక్రం, గ్రామస్థులు స్వామి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని చాటిన దివ్యాంగులు

**- ఉల్లాసంగా సాగిన దివ్యాంగుల ఆటల పోటీలు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు స్థానిక ప్రగతి మైధానంలో నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు అందరితో సమానంగా క్రీడల్లో రానించాలని, రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మెరవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుంబుతూ దివ్యాంగుల క్రీడా స్ఫూర్తిని కొనియాడారు. షాట్‌పుట్‌లో సందీప్, అనిత, అఖిల్, మోక్షిత్., కన్నింగ్‌లో సందీప్, అనిత, అఖిల్, నాగరాజు, హేమంత్ చౌదరి., క్యారమ్ బోర్డులో శైలు, సందీప్ ప్రవీణ రాజు ప్రథమ స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మజ, పిఇటిలు నరేష్, మంగీలాల్, మదన్, బావ్‌సింగ్, జిల్లా దివ్యాంగుల సంఘాల నాయకులు సతీష్, నయూం, ప్రవీణ్, రాజేందర్, ముజాహి



ద్దీన్, దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలల నిర్వాహకులు ప్రసాద్, అరుణ, నాగలక్ష్మీ, గౌతమి, సుబ్బలక్ష్మీ, కార్యాలయ సిబ్బంది వర ప్రసాద్, నాగేశ్వరరావు, నరేష్, ప్రవీణ్, దివ్యాంగులు, ఇతరులు పాల్గన్నారు.

## ఘనంగా టిఎల్ఎం మేళా, సైన్స్ ఫెయిర్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎమిలీ పాఠశాలలో శనివారం టిఎల్ఎం మేళా, సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల యొక్క టిచింగ్, లెర్నింగ్ మెటీరియల్స్‌ను ప్రదర్శించేందుకు నిర్వహించే విద్యా ప్రదర్శన ఇది అని, గురువులు, విద్యార్థులు సృజనాత్మకంగా తయారు చేసిన సామాగ్రిని, పాఠశాలను ఆకర్షణీయంగా, అర్థమయ్యేలా చేయడం ఈ మేళా లక్ష్యమని అన్నారు. విద్యలో నూతన ఆలోచనలు, పద్ధతులను పంచుకునే మంచి వేదికగా ఇది నిలుస్తుందని అన్నారు. సైన్స్ ప్రయోగాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఎదుగుదలకు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రజ్ఞ, ప్రయోగాలను పరీక్షించి వారి మేధాశక్తి అంచనా వేసే విధంగా విద్యార్థుల యొక్క మేధా స్థాయిని అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా పోటీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రానున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ములకలపల్లి మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయితీలలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీలు కలిసికట్టుగా పోటీ చేయనున్నట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, మాస్‌లైన పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూపా భాస్కర్ తెలిపారు. ములకలపల్లి మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన మూడు పార్టీల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలు పరిష్కరించాలని పోరాటాలు నిర్వహిస్తున్న కమ్యూనిస్టులను గెలిపించాలని, మండల వ్యాప్తంగా పేదల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన చరిత్ర, పేదవర్గాలకు అండగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీలు నిర్వహించే సుదీర్ఘ పోరాటాల ఫలితమేనని అన్నారు. భవిష్యత్తులో పేదవారికి అండా, దండగా ఒక్క ఎర్ర జెండా మాత్రమేనని కావున మండల వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కల్లూరి కిషోర్, ముదిగొండ రాంబాబు, పోతుగంటి లక్ష్మణ్, కోర్స రామకృష్ణ, గౌరి నాగేశ్వరరావు, రవికుమార్, రావుజా, పి వెంకటేశ్వర్లు, మధు, అమల, నారాటి రమేష్, సిహెచ్ వెంకటేశ్వర్లు, సాయి, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం సర్పంచ్ అభ్యర్థిగా సదర్ లాల్ నామినేషన్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం గ్రామ పంచాయితీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా భానోత్ సదర్ లాల్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో భారీ జన సందోహంతో పంచాయితీ కార్యాలయానికి వచ్చి నామినేషన్ దాఖలు చేసి ఆయన మాట్లాడుతూ ఈ సారి జరగబోయే పంచాయితీ ఎన్నికలలో సర్పంచ్‌గా తనకు ఓటు వేసి గెలిపించాలని అశ్వాపురం గ్రామ పంచాయితీని అభివృద్ధి బాటలు నడిపిస్తానని మీరందరూ అవకాశం ఇవ్వాలని ప్రజల్ని వేడుకుంటున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు ముత్తినేని సుజాత, టిడిపి మండల అధ్యక్షులు తుళ్లూరు ప్రకాష్, మాజీ ఎంపీటీసీ గంగాభవాని, వేములపల్లి మల్లికార్జున్, వేములపల్లి రమేష్, మాజీ మండల ఉపాధ్యక్షులు భూతం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా బానోత్ రాజి నామినేషన్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూసిరెడ్డి శంకర్‌రెడ్డి ఆశీస్సులతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థి బానోత్ రాజి, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న మద్దెబోయిన నాగమణి తదితరులు, తొలి దశలో జరగబోయే గ్రామ పంచాయితీ ఎన్నికలకు బూర్గంపాడు మండలంలో నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామ పంచాయితీ సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా బానోతు రాజి నామినేషన్ దాఖలు చేయగా, సూరెడ్డి సందారెడ్డి బలపరిచారు. సర్పంచ్ అభ్యర్థితో పాటు వార్డు సభ్యులుగా గాదె పెద్దిరెడ్డి, మద్దెబోయిన నాగమణి, మిరియాల మంగమ్మ, బానోత్ శంకర్, తేజావత్ జ్యోతి, బానోత్ భాస్కర్, బానోత్ గణేష్‌లతో పాటు పలువురు అభ్యర్థులుగా పలువురు గ్రామ వార్డులకు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈకార్యక్రమంలో దౌపాటి రామకృష్ణ, దీపంగి రామచందర్, చిలంకూరి భాస్కర్, మారం రామచంద్రారెడ్డి, మదమంచి రాజేష్, తదితరులు ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జోరందుకున్న పంచాయతీల రణం..!




-రాజకీయ వాతావరణంతో వేడెక్కిన గ్రామాలు
-ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న రాజకీయ పార్టీలు
-గెలుపు ధీమాతో అధికార పార్టీ.. పటు కోసం కారు
-గెలుపును శాసించే దిశగా కమ్యూనిస్టులు

**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రజాస్వామిక వ్యవస్థలో పంచాయితీలే కీలకం, గ్రామాల్లో ప్రజలకు దగ్గరగా ఉండే వ్యవస్థ పంచాయితీవ్యవస్థ, ప్రస్తుత్తం ఆ పంచాయితీల సమరం ప్రారంభమైంది. పదవులు ఆశిస్తున్న చోటా నాయకలు బడా నాయకులను ప్రసన్నం చేసుకొని పోటీలకు సిద్ధం అవుతున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సారి యువత కూడ ముందుకు వస్తుంది. పినపాక నియోజకవర్గంలో మరో మారు బల ప్రదర్శనకు రెండు బడా రాజకీయ పార్టీలు సిద్ధం అవుతున్నాయి. అనేక పంచాయితీలలో బడా పార్టీలకు దీటుగా కమ్యూనిస్టులు కూడ గెలుపు గుర్రాల్లో ఉన్నారు. దీనికి తోడుగా కమలం కూడ నేను ఎమి తక్కువ కాదంటూ పోటీ ఇవ్వగల అభ్యర్థుల కొసం వెతుకులాట మెదలు పెట్టింది.

**నియోజకవర్గంలో ఆదిపత్యం కొసం తాజీ మాజీలు.....**

గత కొద్ది రోజుల క్రితం పినపాక నియోజకర్గం లో పార్టీ కార్యలయం కొసం పోరు జరిగింది. ఆ పోరులో కార్యాలయం ఎవ్వరి చెందక పోయిన, కారు పార్టీ కసికోసం ఎదురు చుస్తుంది. స్ధానంకంలో సత్తా చాటి తమ ఉనికి నిలుపు కొవటానికి ఇద్దరు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ముందుకు సాగుతూ గెలుపు గుర్రాల కొసం వేట మొదలు పెట్టి, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. పంచాయితీల అభివృద్ధిని చూపుతూ ప్రజల్లోకి వెళ్ళాలని కారు పార్టీ నేత కార్యకర్తలకు బోధిస్తుంటే, 14 నెలల ప్రజాపాలనరు వివరిస్తూ ముందకు పోవాలని కార్యకర్తలకు ఆధికార పార్టీ బోధిస్తుంది. ముఖ్యంగా నియోకవర్గ కేంద్రం అయిన మణుగూరులోని సమితి సింగారం పంచాయితీ కొసం ఎత్తులు వేస్తు పోత్తుల కొసం చూస్తున్నారు. మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం, రమానుజవరం, తిర్లాపురం పంచాయితీలలో భారత కమూనిస్టు పార్టీ బలంగా ఉండటంతో ఆ మూడు పంచాయితీలు కమ్యూనిస్టుల ఖాతాలో జమ అవుతాయని పలువురు చెపుతున్నారు. గత రెండు దపాలుగా సమితి సింగారం పంచాయితీ తెలుగుదేశం ఆధీనంలో ఉండగా ప్రస్తుత్తం కూడ వారికే ఆవకాశాలు ఎక్కువ ఉన్నాయని వినిస్తుంది. ఎది ఏమైనా గెలుపు ఓటములను ఒకటి రెండు ఓట్లు తరుమారు చేసే పంచాయితీ ఎన్నికలలో గెలుపు వరించే ఆదృష్టవంతులు తమ ఆశలను పనంగా పెడుతూ పోరుకు సిద్ధం అవుతున్నారు.

# నూతి సత్యనారాయణకు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులుగా నియమితులైన నూతి సత్యనారాయణను శనివారం వైరాలో ఆయన నివాసం నందు ఆత్మ కమిటీ డైరెక్టర్ జాలాది రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ సీతారాములు, మిట్టపల్లి నాగి, వీరంశెట్టి సీతారాములు, మరికంటి రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా దిశగా పుణ్యపురం

## సర్పంచ్‌గా యంగల మరియమ్మ?



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని పుణ్యపురం గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా దిశగా కొనసాగుతుంది. సర్పంచ్ అభ్యర్థిగా అత్తాకోడలు ఇద్దరు నామినేషన్ వేయడంతో నామినేషన్ ఉపసంహరణ అనంతరం పుణ్యపురం సర్పంచ్‌గా కాంగ్రేస్ పార్టీ యంగల మరియమ్మ ఏకగ్రీవంగా ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. వార్డు సభ్యులుగా వార్డుకి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం కూడా ఏకగ్రీవానికి కారణం అని చెప్పవచ్చును.

# వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ బోనకల్ :** వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి బ్రాహ్మణపల్లిలోని నయారా పెట్రోల్ బంక్‌లో ద్విచక్రవాహనంలో పెట్రోల్ కొట్టించుకుని బయటకు వస్తున్న క్రమంలో అటుగా వెళ్తున్న కోళ్ల వ్యాన్ పెట్రోల్ బంక్ వద్ద ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న బ్రాహ్మణపల్లికి చెందిన దామాల బాబు రెండవ కుమారుడు దామల రాయుడు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎన్నికల డ్యూటీలో భాగంగా అటూగా వెళ్తున్న సిఐ మధు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

# వైరా మండలంలో నామినేషన్లకు బారులు తీరిన అభ్యర్థులు

## గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో చివరి రోజు నామినేషన్ల పర్వం జోరుగా కొనసాగింది. మధ్యాహ్యానం నుంచి నామినేషన్ కేంద్రాల వద్ద సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నామినేషన్ వేసే అభ్యర్థులు బారులు చూస్తే జనరల్ ఎన్నికల కోసం ఓటర్ల నిలబడే విధానంగా కనిపించింది. మండలంలో రెబ్బవరం, పాలడుగు, గన్నవరం, గరికపాడు, గొల్లపూడి, ముసలిమడుగు, సిరిపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఈ కేంద్రాల వద్ద నామినేషన్ వేసేందుకు బారులు తీరారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి రోజు కావడంతో భారీగా నామినేషన్లు పర్వం రాత్రి వరకు కొనసాగింది.

# గ్రామాల్లో నామినేషన్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మంచుకొండ, అమ్మపాలెం, కొణిజర్ల, తనికెళ్ల గ్రామాల్లోని పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను అదనపు డిసిపి లా అండ్ ఆడర్ ప్రసాద్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ల ముగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను తప్పకుండా పాటించాలని విజ్ఞాప్తి చేశారు.

# ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

## - ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** డిసెంబర్ 14న జరిగే రెండో విడత స్థానిక సంస్థల గ్రామపంచాయతీ ఎన్నికలకు మండలంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు అంతా పోలీసులకు సహకరించి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేశవాపురం క్రాస్ రోడ్డులో అనూష ఫంక్షన్ హాల్‌లో తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ ఏర్పాటు చేసిన మండల రాజకీయ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో డిసెంబర్ 14న జరిగే సర్పంచ్‌ల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటలకు, ఘర్షణలకు పాల్పడవద్దని, పోలీస్ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన అన్నారు. నామినేషన్లు మొదలుకుని ఎన్నికలు పూర్తయ్యే వరకు మండలంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామపంచాయతీలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు గెలుపొటములు సహజమని, ప్రతిఒక్కరూ గెలిచినా, ఓడినా సహనంతో ప్రశాంతంగా ఉండాలని, ప్రజలను రెచ్చగొడుతూ గొడవలు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టవద్దని, అలా పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని నాలుగు సెక్టార్లల్లో సంబంధిత పోలీస్‌శాఖ అధికారులు ఉంటారని, వారి నెంబర్ ద్వారా ఎలాంటి సమాచారం ఉన్న అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కూచిపూడి జగదీష్,, అదనపు ఎస్సై రామలింగారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ పి.హరీష్, రమాదేవి, రామ్మూర్తి, వీరస్వామి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయి : వెంకన్న



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలే గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపిస్తాయని జోగులపాడు గ్రామపంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ధరావత్ వెంకన్న అన్నారు. పాలేరు శాసనసభ్యులు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆశీస్సులతో జోగులపాడు సర్పంచ్ అభ్యర్థికి పోటీ చేసేందుకు సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యక్తిగత సహాయకులు తంబూరి దయాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జోగులపాడు గ్రామపంచాయతీ మంత్రి పొంగులేటి ఆశీస్సులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో మంత్రి పొంగులేటి ఆశీస్సులతో గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. ధరావత్ వెంకన్న ఆర్ఎంపి వైద్యుడు కావడంతో ప్రజలందరూ అతన్ని కోరుకుంటున్నారని, గ్రామప్రజలంతా సర్పంచ్ ఎన్నికల్లో దీవించాలని ప్రజలను ఆయన వేడుకున్నారు.

# పంచాయతీ ఎన్నికలపై పోలీసులకు శిక్షణ




**ప్రజాపక్షం/ఏన్కూరు :** పంచాయతీ ఎన్నికలపై పోలీసులకు శిక్షణ కార్యక్రమం కల్లూరు డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో శనివారం జరిగింది. అల్లర్ల నియంత్రణపై పోలీసులకు శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. దీనిలో భాగంగా ఏన్కూర్ పోలీస్ స్టేషన్లో ఎస్సై నారబోయిన సంధ్య ఆధ్వర్యంలో పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో అల్లర్లు, దాడులు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అల్లర్లు, దాడులు జరిగితే పోలీసులు స్పందించే తీరుపై శిక్షణ ప్రదర్శించారు. గుంపుల ద్వారా శాంతి భద్రతలకు భంగం కలిగిన సందర్భంలో పోలీసులు తీసుకోవాల్సిన నియంత్రణ చర్యల గురించి శిక్షణ ద్వారా వివరించారు.

# శివయ్య సేవలో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని ఎండి హాస్పిటల్ రోడ్ లో నివాసముంటున్న రిటైర్డ్ ఎస్ఈ వంగరి పద్మారావు కుమారుడు, ఎమ్మెల్యే దంపతుల వ్యక్తిగత సహాయకుడు వంగరి రాకేష్ నివాసంలో శుక్రవారం రాత్రి జరిగిన శివయ్య పడి పూజలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ పాల్గొని, శివయ్య సేవలో తరించారు. అనంతరం స్వాములకు ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని స్వాములకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలరాణి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటి ప్రారంభోత్సవానికి ఈనెల 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు శనివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్‌డిఓ మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నం 2 గం.లకు ఐడిఓసిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు సిఎం చేరుకుంటారని, ఇందుకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఫైరింజన్లు సిద్ధం చేసి అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, భవనాలను అన్ని హంగులతో సిద్ధం చేయాలన్నారు. వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు సౌండ్ సిస్టమ్ సరైన పద్ధతిలో ఉండాలన్నారు. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టిసి వారు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, మహిళా సంఘాలకు భోజన సదుపాయం, మహిళా సంఘాల తరలింపును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆయన ఎస్పి, అదనపు కలెక్టర్‌తో కలిసి సభా ప్రాంగణం, వేదిక, రవాణా మార్గాల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఎస్పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రత్యేక వాహనాల పాస్‌లు, గేటు నిర్వహణ, సిఎం పర్యటనలో ఎలాంటి అంతరాయం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

# అప్పుల బాధ తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

**పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియోలో వేడుకోలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అప్పులు బాధ తట్టుకోలేక ఓ కౌలు రైతు ఆత్మహత్యాయత్నం కు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని శంకరగిరితండా గ్రామానికి చెందిన బాణోత్ వీరన్న (27) అనే కౌలు రైతు వ్యవసాయం లో నష్టాలు అధిగమించలేక శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం కు పాల్పడ్డాడు. శంకరగిరితండా తో పాటు, ముదిగొండ మండలం లోని మాధాపురం తదితర గ్రామాలలో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. అందినకాడికల్లా అప్పులు తెచ్చి, పత్తి, మిర్చి, వరి పంటలను సాగు చేశాడు. కాలం కలిసిరాక, దిగుబడులు లేక, వ్యవసాయంలో నష్టాలు వచ్చాయి. దీంతో దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులైయ్యాయి. దీంతో శనివారం ఓ పొలంలో పరుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం కుపాల్పడి, సెల్ఫీ వీడియో ను తీసుకున్నారు. ఈ సందర్భంగా సదరు రైతు మాట్లాడారు. వ్యవసాయంలో నష్టాలు వచ్చాయి. ధరలు లేక ఇబ్బందులు పడ్డాను. నష్టాలను పూడ్చలేనంతగా ఉన్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. సబ్సిడీలు ఇవ్వాలి. కౌలు రైతులు కౌలు కట్టలేని వారిని రైతులు కూడ ఆదుకోవాలి. అంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం కు పాల్పడ్డాడు. అదే సమమంలో అటుగా వెళ్తున్నా వారు గమనించి వెంటనే ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఓ ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు బాధిత రైతు ను కాపాడాలని వేడుకుంటున్నారు.

# 32 గ్రామ పంచాయతీలు.. 300 వార్డులు..!

**10 నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** డిసెంబర్ 14 న జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ కేంద్రాలను అధికారులు ఎంపిక చేశారు. నేలకొండపల్లి మండలం లోని 32 గ్రామ పంచాయతీలలో 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించేందుకు 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు నామినేషన్ ల ప్రక్రియ చేపట్టనున్నారు. నామినేషన్ కేంద్రాలను స్థానిక ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివలు శనివారం పరిశీలించారు. అధికారులను నియమించినట్లు తెలిపారు. నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాలు, నామినేషన్ కేంద్రాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కోనాయిగూడెం గ్రామ పంచాయతీలో కోనాయిగూడెం, ఆచార్లగూడెం, కోరట్లగూడెం. ఆరెగూడెం, కొత్తకొత్తూరు గ్రామ పంచాయతీలో కొత్తకొత్తూరు, సదాశివాపురం, ఆజయ్ తండా, తిరుమలాపురంతండారాయగూడెంలో అప్పలనరసింహాపురం, రాయగూడెం, కట్టుకాచారం, కొంగర, చెరువుమాదారంలో చెరువు మాదారం, రాజారంపేట, బుద్దారం, నాచేపల్లిలో మంగాపురం తండా, భైరవునిపల్లి, నాచేపల్లి, రాజేశ్వరపురంలో రాజేశ్వరపురం, మూటాపురం, అమ్మగూడెం, శంకరగిరితండా, ముజ్జుగూడెంలో ముజ్జుగూడెం, అనాసాగరం, గువ్వలగూడెం, బోదులబండలో బోదులబండ, పైనంపల్లి, రామచంద్రాపురం, మండ్రాజుపల్లిలో మండ్రాజుపల్లి, సుర్దేపల్లి, చెన్నారం, నేలకొండపల్లి గ్రామ పంచాయతీలో నేలకొండపల్లి గ్రామానికి చెందినవారు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

# నేలకొండపల్లి పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థిగా పసుపులేటి శ్రీలత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థిగా పసుపులేటి శ్రీలత ఎంపికయ్యారు. శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం నందు ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో జరిగిన స్థానిక మేజర్ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అభ్యర్థిగా పసుపులేటి శ్రీలత ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో విద్యావంతురాలు పసుపులేటి శ్రీలతను భారీ మెజార్టీతో కాంగ్రెస్ శ్రేణులు గెలిపించాలని ఆయన పిలుపు నిచ్చారు. నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి పై మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు కోడాలి గోవిందరావు, బొడ్డు బొందయ్య, మాజీ సర్పంచ్ లు వంగవీటి నాగేశ్వరరావు, రాయపూడి నవీన్, మామిడి వెంకన్న, నాయకులు మైసా శంకర్, లక్కం ఏడుకొండలు, దోసపాటి చంద్రశేఖర్, వాకా శ్రీనాథ్, ఎస్.కె.సుభాన్ మియా, కడియాల నరేష్. కనమర్లపూడి రమేష్, అయితనబోయిన శ్రీనివాసరావు, చెరుకు రంగయ్య, గుడిబోయిన వెంకటేశ్వర్లు, పసుపులేటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 5,16,19 వార్డుల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు





**ప్రజాపక్షం/భద్రాచలం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బలపరిచిన అభ్యర్థులు 5,16 వార్డుల్లో వార్డు సభ్యులుగా వారివారి నామినేషన్లను శనివారం దాఖలు చేశారు. ఈ మేరకు వారు ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో 5వ వార్డుకు గానూ జెట్టి రమాదేవి, 16వ వార్డుకు పితాని హెబ్సిబా, 19వ వార్డులో ఇర్పా మహేష్ వేర్వేరుగా వారి అభ్యర్థిత్వ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ, మీసాల భాస్కర్ రావు,కిలారు కొండబాబు,కంభంమెట్టు శ్రీనివాస్,గుంజా రామారావు,సాధనపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పూజారి రజిత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పూజారి రజిత శనివారం 14 వార్డు సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ 22 నెలల కాలంలో అందించిన సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో స్థానిక పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎడమకంటి పిచ్చిరెడ్డి, దుగ్గెంపూడి శేశిరెడ్డి, దారం రామిరెడ్డి, ఎడమకంటి సుధాకర్‌రెడ్డి, కాటం వెంకట్రామిరెడ్డి, నిమ్మల హరీష్, దునుకు రాము, సరోజ, చంచలపు శ్రీను, దారం వెంకట్రామిరెడ్డి, కందుల రాము, ముదిగొండ వీరన్న, పూజారి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ కనపడటం లేదని పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలం సుభాష్‌నగర్ గ్రామ పంచాయితీ మాజీ బిఆర్ఎస్ సర్పంచ్ వల్లాల మంగమ్మ కనబడటం లేదని భర్త వల్లాల నరసయ్య శుక్రవారం రాత్రి నుండి కనబడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త నరసయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాజీ సర్పంచ్ ప్రస్తుత బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి శుక్రవారం రాత్రి నుండి కనబడటం లేదని, తన ఫోన్ స్విట్ ఆఫ్ వస్తుందని తన ఫోన్ కుండా, తెలిసిన బంధువుల ఇండ్లలో కూడా చూసామని, ఎటువంటి ఆచూకీ లేదన్నారు. ఇవాళ ఇల్లందు పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు కింద ఫిర్యాదు చేశామన్నారు. తమకు ఇంట్లో ఎటువంటి కలహాలు లేవని అంతా బాగానే ఉంటున్నామని, ఇతరులతో శత్రుత్వం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 3న బిఆర్ఎస్ పార్టీ తరపున నామినేషన్ వేయనున్న సందర్భంగా రాజకీయంగా ఏమైనా కుట్రలు జరుగుతున్నాయా అనే విషయంపై ఇల్లందు మండలంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఏది ఏమైనా వల్లాల మంగమ్మ కనపడటం లేదని పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా వల్లాల మంగమ్మను బెదిరింపులకు గురి చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ భర్త నరసయ్య సైతం తాము బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని తెలిపారు.

# కొమురం భీం భవన్‌ను ప్రారంభించిన ఎంఎల్ఏ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణంలోని 12వ వార్డు నందుగల కొమరం భీమ్ భవన్‌ను అదనపు పనులు, అన్ని హంగులతో, అన్ని సదుపాయాలు సౌకర్యాలతో పూర్తి చేసినటువంటి కొమురం భీం భవన్‌ను ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నియోజకవర్గంలోని పట్టన కేంద్రమైన ఇల్లందులో కొమురం భీం భవన్‌ను అందుబాటులోనికి తీసుకురావడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఇది ప్రజలకు అన్ని విధాలుగా అన్ని రకాలుగా ఉపయోగపడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరేల సుభిక్ష పాలన కొనసాగుతుందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పాలన సాగిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంబాబు, పిఏసిఎస్ ఛైర్మన్ మెట్ల కృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డ డానియల్ జాఫర్, మండల అధ్యక్షులు పులి సైదులు, జిల్లా నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మాజీ వైస్ ఛైర్మన్ సయ్యద్ జానీ భాషా, 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దినేని హరినాథ్ బాబు, రాకేష్, పండు, గంగరాజు, మధుకాలనీ వాసులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేపు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారం

**-హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి, మంత్రులు**
**-వైరా నుండి ఖమ్మం వరకు భారీ ర్యాలీ**



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతన అధ్యక్షునిగా నూతి సత్యనారాయణగౌడ్ డిసెంబర్1న ప్రమాణస్వీకారం చేయనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తెలియజేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన సీనియర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు నూతి సత్యనారాయణ గౌడ్ రేపు మధ్యాహ్నం మూడు గంటలకు కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మ లనాగేశ్వరరావు, రెవిన్యూ శాఖమంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్, మాలోతు రాందాస్‌నాయక్, పలువుర కార్పొరేషన్ చైర్మన్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లో వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**వైరా నుండి ఖమ్మంకు భారీ ర్యాలీ...**

నూతి సత్యనారాయణ ప్రమణస్వీకారం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు వైరా నుండి వరకు భారీ ర్యాలీతో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌లో పలువురి చేరిక




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో కాంగ్రెస్‌లో పలువురు చేరారు. శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మానుకొండ రాధాకిషోర్ ఆధ్వర్యంలో 130 కుటుంబాలు జిల్లా యూత్ నాయకులు తుమ్మల యుగంధర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి తుమ్మల యుగంధర్ పార్టీ కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంద వెంకటయ్య, బండారు కనకయ్య, టెంటు కనకయ్య, సందా వెంకన్న, దార్న నర్సింహారావు, ఏరువ వెంకటేశ్వర్లు సారధ్యంలో పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో నాయకులు తాతా రఘురాం, గుడిపూడి రామారావు, రెంట్యాల ప్రసాద్, బోయన వెంకటనర్సయ్య, గాజుల కృష్ణారావు, నంద్యా, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారూ.. మాకు న్యాయం చేయండి

**-రైల్వే మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రాయల్ లాడ్జి బిల్డింగ్ తొలగింపు**
**-బిల్డింగ్‌కు నష్టపరిహారం అందించిన ప్రభుత్వం**
**-ఆ బిల్డింగ్ నలుగురు వాటాదారులుగా ఉండగా, ఒకరికి అందని పరిహారం**
**- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం**
**- బెదిరిస్తున్న వాటాదారుడైన లాయర్**
**-బాధితుడు మనస్థాపానికి గురై గుండెపోటుతో మృతి**
**-తమకు న్యాయం చేయాలంటున్న బాధిత కుటుంబికులు**




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ప్రధాన రైల్వే గేటు పక్కన ఉన్న రాయల్ లాడ్జి బిల్డింగ్‌లో వాటాదారునిగా ఉన్న బిల్లకంటి నాగేశ్వరరావుకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం ఇవ్వకుండా ఇతర వాటాదారులు మోసం చేయటంతో మనస్థాపానికి గురైన ఆయన ఇటీవల గుండెపోటుతోమృతి చెందారు. మధిర పట్టణంలోని సికింద్రాబాద్ విజయవాడ ప్రధాన రైల్వే మార్గంలో రైల్వే మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రాయల్ లాడ్జి బిల్డింగ్‌లోని కొంత భాగాన్ని తీసుకోగా తీసుకున్న స్థలానికి, పాత బిల్డింగ్ కావటంతో కూలిపోయే ప్రమాదం ఉందని బిల్డింగ్ మొత్తానికి రైల్వే అధికారులు నష్టపరిహారం చెల్లించారు. ఈ బిల్డింగ్‌లో వాటాదారునిగా ఉన్న బిల్లకంటి నాగేశ్వరరావు 12417/1 రిజిస్ట్రేషన్ డ్యాకుమెంట్ కలిగిన 21 గజాల రెండు గదులు ఉన్నాయి. గత 30 సంవత్సరాలుగా ఇంటి పన్ను, కరెంట్ బిల్లు కడుతున్నాడు. అయితే రైల్వే అధికారులు శిథిలావస్థకు చేరిన రాయల్ లాడ్జి బిల్డింగ్‌ను కూల్చి వేయాలని బిల్డింగ్ మొత్తానికి పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించారు. ఈ నష్టపరిహారం చెల్లింపు విషయంలో జరిగిన సర్వేలో నలుగురు వాటాదారులుగా ఉన్న బిల్డింగ్‌లో మిగతా ముగ్గురు వాటాదారులు ఈ బిల్డింగ్ మొత్తం మాదేనని వారి దగ్గర ఉన్న పాత డాక్యుమెంట్లను చూపించి అధికారులను మభ్యపెట్టి నాల్గొవ వాటాదారుడిగా ఉన్న బిల్లకంటి నాగేశ్వరరావుకు నష్టపరిహారం రాకుండా చేశారని బాధిత కుటుంబం ఆరోపించింది. దీనిపై గత సంవత్సర కాలంగా తమకు నష్టపరిహారం చెల్లించాలని అధికారులు చుట్టూ తిరిగినా


OFFICE OF THE MADHIRA MUNICIPAL COUNCIL,
KHAMMAM (Dist.), TELANGANA

Notice u/s sec 182 of the TS Municipal Act, 2019

Sir/Madam,

Take notice under Section 182 of TS Municipal Act, 2019 the following portion/building ... is in serious condition or likely to fall. You are hereby required as the Owner/Occupier to show cause by submitting your objections if any, within (7) days as to why the same should not be pulled down / Remove / Repair to prevent all causes of danger there from by this office at your expenses. You are entitled to make representation and adduce evidence if any on or before the above-mentioned date. Before removal the pending House and Water Taxes must be cleared.

Commissioner
Madhira Municipality

To
Sri/Smt. ...
Madhira.

పట్టించుకోవటం లేదని బాధిత కుటుంబ సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్డింగ్‌లో వాటాదారునిగా ఉన్న లాయ ర్ మాకు రావాల్సిన నష్టపరిహారం ఇవ్వాలని అడుగుతుంటే నేను న్యాయవాదిని నీవు ఎక్కడైనా చెప్పుకో, అవసరమైతే మిమ్మల్ని మెడపట్టి బయటకు గెంటేస్తానని, ఈ బిల్డింగ్‌కు మీకు ఎటువంటి సంబంధం లేదని, మీకు నష్టపరిహారం ఇచ్చేది లేదని, మీ మీద కేసులు పెడుతానని బె దిరింపులకు పాల్పతున్నట్లు బాధిత కుటుంబం లబోదిబోమంటుంది. ఈ తరుణంలో మాకు ఎటువంటి నష్టపరిహారం రాకుండానే మా రెండు గదులను కూల్చివేయాలని మధిర మున్సిపాల్టీ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. తమకు నష్టపరిహారం రాకుండా అధికారులు నోటీసులు ఎలా ఇచ్చారని బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వ్యవహారంపై విచారణ జరిపించి తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం ఇప్పించటంతో పాటు మాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బాధిత కుటుంబం ముక్తకంఠంతో కోరుతుంది.

# సిపిఐ అభ్యర్థులను, బలపర్చిన వారిని గెలిపించండి

**-సిపిఐలో చేరిన మీరాసాహెబ్**



**ప్రజాపక్షం/ బోనకల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులతో పాటు, బలపర్చిన వారిని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో షేక్ మీరాసాహెబ్ సిపిఐలో చేరారు. వారికి తోట రామాంజనేయులు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన పార్టీ సిపిఐ అన్నారు. పేదల అభ్యున్నతికి అనునిత్యం కృషి చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను, బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముష్టికుంట్ల గ్రామంలో ఐదవ వార్డు సిపిఐ అభ్యర్థిగా షేక్ మీరాసాహెబ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగాల ఆనందరావు, కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కర్‌రావు, సీనియర్ నాయకులు బోయనపల్లి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహణకు మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో 214 పోలింగ్ కేంద్రాలలో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించినట్లు అదేవిధంగా మండలంలో మూడో తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ 10 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలని పోలింగ్ సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేయడం జరిగిందని ఆయన వివరించారు.

# చివరి రోజు నామినేషన్ల జోరు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత నామినేషన్ల ఘట్టం ముగిసింది. రఘునాథపాలెం మండలంలో శనివారం చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 37 సర్పంచ్ స్థానాలకు, 308 వార్డు స్థానాలకు వివిధ పార్టీల మద్దతుతో పలువురు నామినేషన్లు వేశారు. నామినేషన్ ప్రక్రియ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. మొత్తం సర్పంచ్ స్థానాలకు 200లకు పైగా, వార్డు స్థానాలకు 700లకు పైగా నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. డిసెంబర్ మూడు వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండడంతో పోటీ చేసే అభ్యర్థులు ఎవరన్నది ఆరోజు తేలనుంది. మండలంలో ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ తరుపున పలువురు అభ్యర్థులు పోటీ చేస్తుండగా బలమున్న చోట సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు నామినేషన్‌లు దాఖలు చేసినప్పటికీ ఉప సంహరణ తర్వాత బరిలో ఉంటారో లేదో చూడాలి.






# గ్రామాల్లో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

**-ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, వాహనదారులు**
**-పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు**




**ప్రజాపక్షం/ఏన్కూరు :** పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్లైన్ లీక్ కావటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని తూతక్క లింగన్నపేట గ్రామంలో ఏన్కూరు నుండి కేసుపల్లి వెళ్లే రహదారి నీళ్లు నిలిచి వాహనదారులకు, గ్రామస్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. అదే విధంగా ఆంజనేయ స్వామి ఆలయం నుండి పాఠశాలకు వెళ్లే రహదారిలో గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రోడ్డుమీద పారటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు, పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులకు విషయం తెలిపినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైప్లైన్ లీకేజీలను బాగు చేయించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.